క్లుప్తంగా

భోగేశ్వరాలయాభివృద్ధికి కృషి



భోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: గడిగరేవుల గ్రామం సమీపంలో వెలసిన భోగేశ్వరాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను ఆలయ ఈఓ చంద్రశేఖర రెడ్డి, చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఊసేన్‌భాష, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ వేదిక మార్పు

పాణ్యం: ఉపాధి హామీ పథకం కింద 2021–23 సంవత్సరానికి సంబంధించి చేసిన పనులపై ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించాల్సిన బహిరంగ సమావేశాన్ని మరో చోటికి మార్పు చేసినట్లు ఏపీఓ విజయరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 21న నంద్యాల జిల్లాలోని పాండురంగాపురం సీఎల్ఆర్‌సీ కార్యాలయం వద్ద సమావేశం జరుపునున్నట్లు వెల్లడించారు. ఈ ప్రజా వేదికకు ఉపాధి అధికారులు, సిబ్బంది, కూలీలు హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

ఘనంగా శివాజీ జయంతి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామ యువకులు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సమావేశమై శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివాజీ చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

భగవద్గీత పఠనాన్ని అలవర్చుకోండి

కల్లూరు: భగవద్గీత చదవడం అలవర్చుకోవాలని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక–ప్రబోధ సేవా సమితి కల్లూరు కమిటీ సభ్యులు సూచించారు. ఆదివారం ఎ.గోకులపాడు గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా ఓం నమఃశివాయ అనే పంచాక్షరి మంత్రం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆ సమితి కల్లూరు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం ఇస్కాన్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పఠనం, హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజ భోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

మహాశివుడికి అన్నాభిషేకం

కర్నూలు కల్చరల్: మహా శివరాత్రి ఉత్సవాలు రెండో రోజు ఆదివారం ఘనంగా జరిగాయి. శివపార్వతుల కల్యాణం, పల్లకి సేవలు, రథోత్సవాలు, గ్రామోత్సవాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సంకల్ బాగ్‌లోని హరి హరక్షేత్రంలో మహాశివునికి అన్నాభిషేకం నిర్వహించారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, కుటుంబ సభ్యులు రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేదిక బాలోత్సవం

కర్నూలు సిటీ: చిన్నారులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించి సృజనాత్మక వికాసం కలిగించే వేదిక బాలోత్సవమని మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత ఎం.రాజశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ స్కూల్‌లో ఏర్పాటు చేసిన బాలోత్సవ్ కార్యక్రమ కేంద్రాన్ని ఆయన పరిశీలించి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో బాలోత్సవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బాలోత్సవం–2023 నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి శేషయ్య, కన్వీనర్లు కెంగార మోహన్, ఎం.పి.బసవరాజు, కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

శేషమ్మ మృతికి ఎమ్మెల్యే సంతాపం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు ఎంపీపీ 2 నెహమ్యా చిన్నమ్మ శేషమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధాకర్ పంచలింగాల గ్రామానికి చేరుకుని శేషమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, గార్గేయపురం ఉప సర్పంచ్ కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

అంగరంగ వైభవంగా..

- పరమశివుడి కల్యాణోత్సవం
- తిలకించి పరవశించిన భక్తజనం



భోగేశ్వరుడి కల్యాణంలో మంగళ సూత్రం చూపిస్తున్న వేద పండితులు



కాల్వబుగ్గలో స్వాముల వారికి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



సి.బెళగల్‌లో ఆదిదంపతులు కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు

ఓర్వకల్లు/గడివేముల/పాణ్యం/సి. బెళగల్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం పరమశివుడి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పలు శైవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాల్వబుగ్గ దేవస్థానంలో ఆదివారం తెల్లవారు జామున భ్రమరాంబాదేవి, బుగ్గరామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తులను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో ఆశీనులుచేసి కల్యాణ కట్టవద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ఆదిదంపతులను పెళ్లి పీటలపై కూర్చోబెట్టి శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించారు. సుమారు గంటపాటు జరిగిన ఈ వేడుకను భక్తులు కనులారా వీక్షించి తన్మయం చెందారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జీకే వెంగన్న, ఆకుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● గడిగరేవుల ఎర్రమల కొండల్లో వెలసిన దుర్గాభోగేశ్వరుని కల్యాణం ఆదివారం తెల్లవారుజామున కనుల పండువగా జరిగింది. ముందుగా వేదపండితులు స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయచైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. తర్వాత పురోహితుల మంత్రోచ్ఛారణ మధ్య పార్వతీ,పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ ప్రధానార్చకులు శ్యాం సుందర్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.క ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తలు పరమేశ్వర రెడ్డి, శివుడు, సురేంద్రనాథరెడ్డి, కుమారి పాల్గొన్నారు.

● పాణ్యంలోని పాణికేశ్వరస్వామి ఆలయంలో శివనామస్మరణ మార్మోగింది. జాగరణ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం తెల్లవారుజామున అర్చకులు స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ మేకల పల్లవి, కరుణాకర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బాలశంకర్ పాల్గొన్నారు. అలాగే శ్రీ భృంగీశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఇక్కడ పానక పందెరం నిర్వహించారు.

● మండల కేంద్రం సి.బెళగల్‌లో శ్రీ గట్టు మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవి కల్యాణాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా పురోహితులు ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించి నందికోలు సేవ భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఎద్దుల బండిపై ఊరేగించారు. అలాగే గ్రామంలోని మిట్ట సోమప్ప, అన్నప్ప స్వామి ఆలయాల్లో కూడా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాండురంగన్న, గ్రామ పెద్దలు చిన్న మునెప్ప, నిర్వాహకుడు శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.



నందికోలు నిర్వహిస్తున్న దృశ్యం

● కొత్తూరు గ్రామంలో శ్రీ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈఓ రామక్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్లూరు: ఉలిందకొండలో గౌరీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణాన్ని గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

నేడు చనుగొండ్లలో బండలాగు పోటీలు

గూడూరు రూరల్: చనుగొండ్లలో శ్రీ నాగలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం గ్రామ స్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. స్థానిక హైస్కూల్ మైదానంలో నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన వృషబాలకు మొదటి బహుమతిగా రూ. 10,016, రెండో బహుమతిగా రూ. 7,016, మూడవ బహుమతిగా రూ. 5,016, నాలుగో బహుమతిగా రూ. 3,016 అందించనున్నట్లు నిర్వాహకులు సూర్యనారాయణ, బాలచంద్రుడు తెలిపారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కర్నూలు (టౌన్): క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ సతీ మణీ స్వర్ణలత అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి విలువిద్య సీనియర్ స్థాయి ఎంపిక పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడికి అభినందన

కర్నూలు (టౌన్): ఇటీవల గుంటూరులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో కర్నూలు కర్నూలు మైపర్ టెన్నిస్ అకాడమీకి చెందిన డి.సాయిశంకర్ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారుడిని ఆదివారం స్థానిక మైపర్ టెన్నిస్ అకాడమీలో మైపర్ విద్యా సంస్థల అధినేత ఆదిమూలపు స్టెల్లా, ఆదిమూలపు సతీష్‌లు అభినందించారు. రూ.20 వేలు నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించారు.

తీపి శత్రువు...

- షుగర్ నియంత్రణ లేకపోతే కిడ్నీ, గుండె, నాడీ మండలాలకు ఇబ్బందులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు

జిల్లాలో 23,52,639 మంది జనాభా ఉండగా ఇప్పటి వరకు 17,35,659 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, హెల్త్ ఐడీ కార్డులు జనరేట్ చేశారు. ఇందులో 30 ఏళ్లపైడిన వారు 9,29,668 మంది ఉండగా వారిలో బీపీ నిర్ధారణ అయిన వారు 38,824 మంది, బీపీ లక్షణాలున్న వారు 1,212,740 మంది ఉన్నారు. అలాగే షుగర్ నిర్ధారణ అయిన వారు 27,959 మంది ఉండగా, షుగర్ లక్షణాలున్న వారు 1,27,883 మంది ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. షుగర్ శరీరానికి పెద్ద శత్రువు. పేరులో తీపిని దాచుకున్న ఈ మహమ్మారి శరీరాన్నంతా గుల్లచేస్తోంది. నియంత్రణలో లేకపోతే శరీరంలోని ప్రధాన అవయవాలను దెబ్బతిస్తుంది.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో గత కొన్నేళ్లుగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) పేరుతో సర్వే చేస్తున్నారు. ఈ మేరకు ప్రజలను పరీక్షించి వారికి హెల్త్ ఐడీ కార్డులు క్రియేట్ చేసి వివరాలు నమోదు చేస్తున్నారు. మొత్తంగా అన్ని వర్గాల ప్రజల్లో 13.13శాతం మందికి బీపీ, మరో 13.78శాతం మందికి షుగర్ ఉన్నట్లు ఇప్పటి వరకు తేలింది. వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా అందజేస్తున్నారు. అలాగే ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి నెలా 25వేల మంది షుగర్ బాధితులకు, 37వేల మంది బీపీ బాధితులకు మందులు, చికిత్స అందిస్తున్నారు. వీరు గాక నగరాల్లో, పట్టణాల్లో ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స తీసుకుంటున్న వారు 2 లక్షల మందికి పైగానే ఉంటారని అంచనా. మొత్తంగా జనాభాలో 18శాతం మందికి షుగర్, 20శాతానికి పైగా బీపీ ఉంటుందని వైద్యులు అంచనా వేశారు.

కిడ్నీలు అతలాకుతలం

షుగర్, బీపీ నియంత్రణలో లేకపోతే ముందుగా దెబ్బతినేది కిడ్నీలేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే వారి వద్దకు వెళ్లే రోగులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయిస్తుంటారు. రక్తంలో క్రియాటినిన్ లెవెల్స్ పెరిగిన వెంటనే చికిత్స ప్రారంభిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే రోజుకు వంతుల వారీగా 50 నుంచి 80 మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నారు.



పెద్దాసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు(ఫైల్)

ఇన్‌ఫెక్షన్ సోకితే కాలికి ముప్పే:

షుగర్ రోగులకు కాలుకు దెబ్బతగలకుండా చూసుకోవాలి. ఒక్కసారి దెబ్బతగిలిందా అది ఇన్‌ఫెక్షన్‌కు దారి తీయకుండా జాగ్రత్త పడాలి. షుగర్ రోగుల్లో అధిక శాతం మందికి న్యూరోపతి వస్తుంది. అంటే కాలిచివరి భాగంలో పాదాలు, వేళ్లలో నరాలు పనిచేయక మొద్దుబారి పోతాయి. దాని వల్ల ఆ ప్రాంతంలో స్పర్శ కనిపించదు. దీంతో గాయం తగిలినా చాలా మందికి తెలియదు. అది పెద్దగా మారి ఇన్‌ఫెక్షన్‌కు దారి తీసేంత వరకు చాలా మంది చూసుకోలేరు. గాయం మానడానికి చాలా సమయం పడుతుంది. కొంతమందిలో ఇన్‌ఫెక్షన్ ఎక్కువై కాలు కొంత భాగం వరకు తొలగించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇక ఎక్కువగా షుగర్ నియంత్రణ లేనివారిలో గుండెపోటుతో పాటు కంటి జబ్బులు, క్షయ ప్రభావం అధికంగా కనిపిస్తుంది.

ఏడాదికోసారి రక్త పరీక్షలు చేయించుకోవాలి



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కిడ్నీ సమస్యలతో వచ్చే వారిలో 50శాతం మంది షుగర్ రోగులే ఉంటున్నారు. అధిక శాతం కిడ్నీలు ఫెయిలైన దశలో వీరు వస్తున్నారు. వైద్యుల సూచనతో షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి బ్లడ్ యూరియా, సీరమ్ క్రియాటినిన్ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ వెంకట పక్కిరెడ్డి, నెఫ్రాలజిస్టు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

రమణీయం రామలింగేశ్వరుడి రథోత్సవం



గుడిపాడులో అశేష భక్తజనం మధ్య రామలింగేశ్వర స్వామి రథోత్సవం



గూడురులో..



పందిపాడు శివన్న తోటలో..

గూడూరు రూరల్: గుడిపాడులో శ్రీ రామలింగేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ వేడుకను తిలకించారు. ముందుగా స్వామి వారికి గ్రామ పెద్దలు చంద్రారెడ్డి, రంగారెడ్డి, మల్లికార్జునరెడ్డి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముందుకు లాగారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు గజేంద్ర గోపాల్, చరణ్‌కుమార్, చెట్టుకింది మద్దిలేటి, సులేమాన్ పాల్గొన్నారు.

గూడూరు: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో నీలకంఠేశ్వరుడి రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా సాగింది. మొదట నీలకంఠేశ్వర ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను తీసుకొచ్చి రథంపై ఆశీనులు చేశారు. తర్వాత భక్తజనం శివనామస్మరణ చేస్తుండగా రథం ముందుకు కదిలింది. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● చనుగొండ్ల శ్రీ నాగలింగేశ్వర, కేశవ, బసవేశ్వరస్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. ఎంపీపీ సునీత, సర్పంచు వెంకటేశ్వరమ్మ, ప్రతాప్‌రెడ్డి, గ్రామ పెద్దలు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశేష భక్తులు, గ్రామ ప్రజల సమక్షంలో రథాన్ని లాగారు.

కల్లూరు: మహా శివరాత్రిని పురస్కరించుకుని పందిపాడు శివన్న తోటలో స్వామి రథోత్సవం నిర్వహించారు. గ్రామ రైతులు కాడెద్దులను దేవాలయం చుట్టు తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం శివన్న తోట నుంచి బసవన్న మండపము వరకు భక్తజనం మధ్య రథాన్ని తీసుకెళారు.

ఆదోనిలో సువిధ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ స్టాపింగ్

ఆదోని అర్బన్ : యశ్వంతపూర్– జైపూర్‌కు వెళ్లే వీక్లి సువిధ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్‌నం.82653, 82654) రైలు ఆదోనిలో ఆగనుంది. సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ సలహా మండలి సభ్యుడు, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విన్నపం మేరకు రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాంతం నుంచి వ్యాపారులు, ఉద్యోగులు వివిధ పనులపై జైపూర్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. ప్రతి గురువారం ఈ రైలు కర్ణాటకలోని యశ్వంతపూర్‌లో బయలుదేరి ఆదేరోజు గుంతకల్, మంత్రాలయం మీదుగా జైపూర్‌కు వెళ్తుంది. గుంతకల్, మంత్రాలయం రైల్వేస్టేషన్‌లలో మాత్రమే నిలుపుతున్నారు. ఆదోనిలో కూడా నిలపాలని తాను కోరడంతో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు స్టాపింగ్‌కు అనుమతి ఇచ్చారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



స్విమ్మర్ శృతిని సన్మానిస్తున్న ఇంటెలిజెన్స్ డీఎస్పీ తదితరులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కర్నూలు ఇంటెలిజెన్స్ డీఎస్పీ జి.వెంకటరాముడు అన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన 66వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లు వై.దేవ్‌కృత్ సాయి, కె.శృతిలను జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. అదేవిధంగా వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. కురువ సంఘం గౌరవాధ్యక్షుడు కె.క్రిష్ణన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె. రంగస్వామి, కోశాధికారి కె.సి.నాగన్న, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఆర్‌వీపీఎస్ అధ్యక్షుడు రవికుమార్, అమీలియో హాస్పిటల్ అధినేత లక్ష్మీ ప్రసాద్ చాపే తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత శకునాల



కబడ్డీ విజేతలకు నగదును బహుమతిని అందజేస్తున్న యాదవ సంఘం సభ్యులు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న శివనరసింహారెడ్డి

పగిద్యాల: మహాశివరాత్రిని పురస్కరించుకుని కురువ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్వేశ్వరస్వామి బంగ్లా కట్ట వద్ద నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో శకునాల జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు ఆదివారం నగదు బహుమతులను అందజేశారు. మిట్టకందాల, దామగట్ల, పడమర ప్రాతకోట జట్లు ఆతరువాతి వరుస స్థానాలలో నిలిచాయి. దాతలు లక్ష్మీనారాయణ, కురువ మల్లయ్య, బడికెల స్వాములు, అంబటి రామకృష్ణ, సర్పంచ్ శేషన్న, గొల్ల ఉసేనయ్య, తొండ గంగాధర్ సహకారంతో రూ. 12 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు నగదును అందజేశారు. అలాగే పొట్టేళ్ల పందెంలో గెలుపొందిన మండ్లెం ఖాదర్‌బాషా, తిమ్మాపురం హనుమ, చెరుకుచెర్ల వంశీ, నాగటూరు సాయి పొట్టేళ్లకు నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, యాదవ సంఘం సభ్యులు శెట్టిమాన్ మధు, తొండ మద్దిలేటి, గొల్ల శేషన్న, కరువ జమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి ప్రారంభించారు. తొలి ఆరు స్థానాల్లో నిలిచిన జట్లకు వరసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, లోటర్ బాషా, జీకే వెంగన్న, రామేశ్వరరెడ్డి, గోపా రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



ఉప్పలపాడులో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈపోటీలు నిర్వహించారు. ఇందులో వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన గొంది బజారు, దొర్నిపాడు బత్తుల మనోహర్‌యాదవ్ వృషభాలు (ఉభయజత) నిర్ణీత సమయానికి 4,170 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.40 వేలు గెలుపొందాయి. వెల్దుర్తి మండలం చెరుకులపాడు రామాంజనేయులు, బోయినపల్లె చరణ్ వృషభాలు (విడిజత) 3,300 అడుగుల దూరం లాగి రెండో బహుమతిగా రూ.20 వేలు సాధించాయి. బోయినపల్లె వెంకటరామయ్య, నందికొట్కూరు అబ్దుల్‌కలామ్ వృషభాలు సమాన దూరం లాగడంతో (3300 అడుగులు) రూ.20 వేల చొప్పున నిర్వాహకులు అందజేశారు. అలాగే ఇస్కాల రమణారెడ్డి, వర్కూరు రామచంద్ర వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ.8 వేలు, మంచాలకట్ట వెంకటస్వామి, బొల్లవరం దేవేంద్రనాయక్ వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.5 వేలు గెలుచుకున్నాయి. ఈ పోటీలకు వాడాల నాయుడు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతు నాయకులు పాల్గొన్నారు.

గడివేముల: మహాశివరాత్రిని పురస్కరించుకుని భోగేశ్వరాలయం పరిధిలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నాలుగు పండ్లలోపు ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించిన ఈ పోటీల్లో కర్నూలు జిల్లా పందిర్లపల్లెకు చెందిన ఖాలీక్‌బాషా ఎడ్లు మొదటి బహుమతి (రూ.30 వేలు) గెలుచుకున్నాయి. పి. రుద్రవరం చెందిన ఎల్లాగౌడ్ వృషభాలు రెండోస్థానం (రూ.20 వేలు), యాడికొండ గ్రామానికి చెందిన పెద్దయ్య ఎడ్లు మూడోస్థానం (రూ.15 వేలు), క్రిష్ణగిరి మండలం అమకతాడు గ్రామానికి చెందిన మూగెన్న ఎడ్లు నాలుగో స్థానం (రూ.10 వేలు) సాధించాయి. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటక్రిష్టారెడ్డి, రమేష్, ఐసాని వెంకటేశ్వరెడ్డి, ధర్మకర్తలు సురేంద్రనాథ్‌రెడ్డి, పరమేశ్వరెడ్డి పాల్గొన్నారు.



గడివేముల.. విజేత ఎడ్ల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం